నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 3 జూలై 2024 | ADILABAD NIRMAL



కుభీర్ మండలంలోని రాజూర-చొండి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

# బస్సులు నడవక.. బడికి పోలేక

## అవస్థలు పడుతున్న విద్యార్థులు

- రూట్ లేక కొన్ని చోట్ల.. రూట్ ఉండి మరికొన్ని చోట్ల..
- కాలినడకన, సైకిళ్లు, ఆటోల్లో బడికి వెళ్లేటోళ్లు ఎంతో మంది
- ఆర్టీసీ అధికారులు దృష్టి పెడితే విద్యార్థులకు ఉపయోగం



ఇచ్చోడ(సిరికొండ) : ఆయా గ్రామాల నుంచి ఇచ్చోడకు ఆటోలో వేలాడుతూ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు



### నెలకు రూ.500లకు పైగా అవుతున్నాయి..

ఇచ్చోడ (సిరికొండ), జూలై 2 : సిరికొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. మా ఊరు సుంకిడి నుంచి సిరికొండకు నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో రోజు ఐదుగురం ఆటోలో బడికి వెళ్తున్నాము. ఒక్కొక్కరికి రోజు పోయి రావడానికి రూ.30లు అవుతున్నాయి. ఆదివారాలు, సెలవులు పోనూ.. నెలకు దాదాపు రూ.500లకు పైగా అవుతున్నాయి. మేము ఆర్థికంగా వెనుకబడిన వాళ్లం. కొన్నిసార్లు ఆటోలు లేకపోవడంతో నడుచుకుంటూ వెళ్తున్నాం. కొన్ని కొన్ని సార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు నడపా లని కోరుతున్నా.

**- కిరణ్, 10వ తరగతి, సుంకిడి, సిరికొండ మండలం**



### బడికి వెళ్లాలంటే భయమేస్తుంది

ఇచ్చోడ (సిరి కొండ), జూలై 2 : సిరికొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో ఆరో తరగతి చదువుతున్నా. మా ఊరు జాకీర్‌గూడ నుంచి బడికి మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. మా ఊరి నుంచి రోజు పది మందికిపైగా ఆటోలో వెళ్తాము. ఒక్కొక్క రికి వెళ్లి రావడానికి రూ.20లు అవుతు న్నాయి. ఒక్కోసారి ఆటోలు దొరుకకపో వడంతో సాయంత్రం ఇబ్బంది అవుతున్న ది. ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిరావడానికి భయమేస్తున్నది. భద్రత కరువవుతున్నది.

**- ఎస్.సునీత, ఆరో తరగతి, జాకీర్‌గూడ, సిరికొండ మండలం**

నిర్మల్/ఆదిలాబాద్, జూలై 2(నమస్తే తెలంగాణ) : విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్దిపాటి ఖర్చుకు వెనుకాడుతుండడంతో ప్రభుత్వ పాఠశాలలకు దూరంగా ఉన్న పేద విద్యార్థులు చదువుకు నోచుకోలేకపోతున్నారు. వీరికి విద్యాశాఖ రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెబుతున్నా.. ఆచరణలో అమలు కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాలకు తారురోడ్డు ఉన్నప్పటికీ బస్సులు నడవడం లేదు. దీంతో విద్యార్థులు సమీప గ్రామాల్లోని పాఠశాలలకు కాలి నడకన, ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తున్నది. అలాగే మరికొన్ని గ్రామాలకు సమయపాలన లేకుండా బస్సులు నడపడం వల్ల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఎదురవుతున్నాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులే స్వచ్ఛందంగా ఆటో రిక్షాలను ఏర్పాటు చేసి విద్యార్థులను రప్పిస్తున్నారు. చాలా గ్రామాలకు రవాణా సౌకర్యం, బస్సుల రాక విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారు. ఈ అవకాశాన్ని ఆసరా చేసుకుని ప్రైవేట్ పాఠశాలలు ఊరూరా తమ బస్సులను నడుపుతూ విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్చుకుంటున్నాయి. ప్రభుత్వం స్పందించి అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్సులను నడిపితే విద్యార్థులు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా దృష్టి కేంద్రీకరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన వానల్‌పాడ్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్న భైంసా మండలంలోని వటోలి, పేండ్‌పెల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు

### నిర్మల్ జిల్లాలో ఆర్టీసీ బస్సు నడవని గ్రామాలు..

- భైంసా మండలంలోని వటోలి, పేండ్‌పెల్లి, హంపోలి(కే), బోరిగాం, హస్గుల్, ఇలేగాం, సిరాల, చుచుంద్, ఖత్‌గాం, సిద్దూర్.
- సారంగాపూర్ మండలంలో ప్యారమూర్, జెవులి, పొట్యా, గోపాల్‌పేట్.
- నిర్మల్ మండలంలోని మేడిపెల్లి, నీలాయిపేట్, అనంతపేట్, ఎల్లారెడ్డిపేట్, కొత్త పోచంపాడ్, భాగ్యనగర్, తల్వేద, ముజ్గి, అక్కాపూర్, ముఠాపూర్, తాంశ, కౌట్ల(కే).
- సోన్ మండలంలోని సిద్ధులకుంట, జాఫ్రాపూర్, కూచన్‌పెల్లి, సంగంపేట్, న్యూ వెల్మల్, బొప్పారం, లోకల్ వెల్మల్.
- దిలావర్‌పూర్ మండలంలో మాడేగాం, కదిలి.
- ముథోల్ మండలంలోని తరోడ, పిప్రి.
- బాసర మండలంలోని కిర్గుల్(బి), టాక్లి, లాబ్ది, దోడాపూర్.
- తానూర్ మండలంలోని జరి(బి), ఉమ్రి(కే), ఎల్వత్, వడోన, హిప్నెల్లి తాండ, దాగాం, కళ్యాణి, కుప్టి.
- కుభీర్ మండలంలోని రాజురా, కుప్టి, వర్ని, కస్రా, పార్డీ(కే), డోడర్న, సిర్పెల్లి, బెల్గాం.
- కుంటాల మండలంలోని అంబుగాం, మెదన్‌పూర్, వెంకూర్, విఠాపూర్, పెంచికల్‌పాడ్.
- పెంబి మండలంలోని తాటిగూడా, పుల్గంపాండ్రి, లోతొర్యతండా, షెట్‌పెల్లి, ఇటిక్యాల, యాపల్‌గూడ, రాంనగర్, గుమ్మెన ఎంగ్లాపూర్, దొందారి, హరిచంద్ తండా, తులిసిపేట్, అంకెన, రాయదారి, పోచంపెల్లి, కర్ణం లొద్ది, కొసగుట్ట.
- దస్తూరాబాద్ మండలంలోని భూత్కూర్, గొడిసిర్యాల.



తానూర్ మండలం ఉమ్రి(కే) గ్రామానికి తారు రోడ్డు ఉన్నా బస్సు సౌకర్యం లేదు..

### ఆదిలాబాద్ జిల్లాలో..

ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. జిల్లా, మండల కేంద్రాలు, ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు రోజు తమ సొంత గ్రామాల నుంచి బడికి వెళ్లి వస్తుంటారు. ఇందుకోసం విద్యార్థులు ప్రధానంగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతారు. మారుమూల గ్రామాలతోపాటు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలు, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, సిరికొండ వంటి ఏజెన్సీ మండలాల్లోని గ్రామాల విద్యార్థులు రవాణ పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. రవాణా సౌకర్యం లేక పాఠశాలలకు ఆలస్యంగా వస్తున్నారు. బడికి సమయానికి చేరుకోవడం కోసం ఆటోల్లో వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకున్నది. ఉదయం బడికి పోయేటప్పుడు, సాయంత్రం బడి నుంచి వచ్చేటప్పుడు విద్యార్థులకు ఆటోల్లో ప్రయాణం చేయాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి తమ విద్యార్థుల పాఠశాల సమయాల్లో బస్సులు నడుపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సారంగాపూర్ మండలం జెవులి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన స్వర్ణ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు

# జడ్పీ చైర్మన్లను సన్మానించిన కేసీఆర్



కేసీఆర్‌తో నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి కుటుంబసభ్యులు

**భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) పార్టీ జిల్లా పరిషత్(జడ్పీ) చైర్మన్లను ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో వారికి శాలువాలు కప్పారు. జడ్పీ చైర్మన్ల పదవీకాలం ఈనెల 4వ తేదీతో ముగియనుండడంతో వారి కుటుంబ సభ్యులతో సమావేశానికి ఆహ్వానించారు. కాగా.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా జడ్పీ చైర్మన్లు, వారి కుటుంబ సభ్యులను పేరుపేరునా పలకరించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.**



కేసీఆర్‌తో ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కుటుంబసభ్యులు

# వాగుదాటి.. మొక్కలు నాటి

**పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సంతరిస్తుందని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. మంగళవారం ఎంపీడీవోతోపాటు పలువురు ఆధికారులు పస్పుల వాగు దాటి డ్రైడే, వన మహోత్సవం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల చుట్టూ నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు, ఏపీవో రాజశేఖర్, ఏపీఎం గంగారెడ్డి పాల్గొన్నారు.**

**- పెంబి, జూలై 2**



పస్పుల వాగు దాటుతున్న ఎంపీడీవో, సిబ్బంది

# గ్యారెంటీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

- పాలన పక్కన పెట్టి ఢిల్లీ యాత్రలు
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- రైతు భరోసా, రుణమాఫీ అర్హులకు ఇవ్వాలి..
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూలై 2(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక మోసం చేయాలని చూస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఉచిత బస్సు ప్రయాణం తప్పా ఇతర గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహజ్యోతి పథకంలో అర్హులుగా ఉన్న వారికి కూడా జీరో బిల్లులు రావడం లేదని, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలుపుకోవాలని సూచించారు. రేవంత్ గురువు చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో రూ.4 వేల పింఛన్‌తోపాటు ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నారని, తెలంగాణలో హామీలు ఎందుకు అమలుకావడం లేదో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యేడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ఇప్పటివరకు ఒక్క ఉద్యోగ ప్రకటన వెలువరించలేదన్నారు. వృద్ధులకు పింఛన్లు సరిగ్గా రాక ఇబ్బందులు పడుతున్నారని, అపరిశుభ్రతతో మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మిషన్ భగరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించామని, ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా నీళ్లు సరిగ్గా పంపిణీ కావడం లేదన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

### రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వాలి

అన్నదాతలకు రుణమాఫీ, రైతుభరోసా అందించడంలో ప్రభుత్వం మోసం చేయాలని ప్రయత్నిస్తున్నదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. వానకాలం ప్రారంభమై నెల రోజులు దాటినా రైతుభరోసా అందలేదని, రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి రైతులను మభ్యపెడుతున్నారన్నారు. తెల్లరేషన్ కార్డు, కుటుంబంలో ఒక్కరికే వంటి నిబంధనలు రైతులకు శాపంగా ఉన్నాయని మండిపడ్డారు. అర్హులైన రైతులందరికీ ఈ పథకాలు అందచేయాలన్నారు. రాష్ట్రంలో పాలనను పక్కన పెట్టి ఢిల్లీ యాత్రలు చేస్తున్నారన్నారు. రైతుభరోసా విషయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యాఖ్యలు సరికాదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాళ్లు, రప్పలు, సాగులో లేని భూములకు రైతుబంధు ఇచ్చిందని అంటున్నాడు. అప్పుడు మంత్రిగా ఉన్న తుమ్మల ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో పర్సంటేజీలు, కమిషన్‌ల మయంగా తయారైందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు యూనిస్ అక్బానీ, సాజీదొద్దీన్, అలాల అజయ్, శ్రీనివాస్, మిష్ఠు ఉన్నారు.



రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

# మెగా డీఎస్సీ పోస్టులను విడుదల చేయాలి

జైనథ్(బేల), జూలై 2 : డీఎస్సీ పోస్టులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్, జిల్లా హాస్టల్ కన్వీనర్ హరీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో బేల మండల కేంద్రంలోని శివాజీచౌక్ నుంచి అంబేద్కర్‌చౌక్ వరకు ర్యాలీగా వచ్చి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా హరీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 25 వేల మెగా డీఎస్సీ పోస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహేశ్, కుర్మ పవన్‌రెడ్డి, అభిషేక్ అనూజ్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.